

రూ.2 లక్షల విరాళం

గోకవరం: స్థానిక పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.2 లక్షల విరాళం అందించారు.




అంగరంగ వైభవం

అంతర్వేదిలో లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

8లో

సాగుకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఫ్లెక్సీలలో మంత్రి సుభాష్ ముఖానికి స్టిక్కర్



ద్రాక్షారామ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మంత్రి ముఖానికి అతికించిన స్టిక్కర్

సాక్షి ఇంపాక్ట్

రామచంద్రపురం రూరల్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి కల్యాణ ఆహ్వాన ఫ్లెక్సీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫొటో వేశారు. దీనిపై సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన ఈఓ గారూ.. ఈసీ కోడ్ ఉందండీ.. వార్తకు అధికారులు స్పందించారు. ద్రాక్షారామ ప్రధాన రహదారితో పాటు రామచంద్రపురం పట్టణం, పలు ప్రాంతాల్లో రహదారుల పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మంత్రి సుభాష్ ముఖం కనిపించకుండా స్టిక్కర్లు వేయించారు. ఎన్నికల కోడ్ అమలు చేయించడంలో 'సాక్షి' పాత్రపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కూటమి ప్రభుత్వంపై పోరాటం చేద్దాం

అమలాపురం టౌన్: వలంటీర్లు ఆర్థిక సమస్యలు, మనో వేదనతో సతమతమవుతున్నారని జిల్లా వలంటీర్ల సంఘ గౌరవాధ్యక్షుడు, జిల్లా సీపీఐ కార్యదర్శి కె.సత్తిబాబు అన్నారు. విజయవాడ బందర్ రోడ్డులో ఓ వలంటీర్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమలాపురంలో మంగళవారం ప్రకటన విడుదల చేశారు. వలంటీర్లు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, పోరాడి సాధించుకుందామని హితవు పలికారు. వలంటీర్లలో అత్యధికంగా విద్యావంతులు ఉన్నారని గుర్తు చేశారు. వలంటీర్లకు పనైనా చూపిండి, తిండైనా పెట్టండి అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతున్న తరుణంలో ఆ వలంటీర్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరమన్నారు. వలంటీర్లను కొనసాగిస్తాం, వారి వేతనాలు రూ.5 వేల నుంచి రూ.10 వేలు చేస్తామన్న హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసేదాకా పోరాడదామని స్పష్టం చేశారు.

పారదర్శకంగా రీసర్వే

అమలాపురం రూరల్: అత్యంత పారదర్శకంగా రీసర్వే చేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎస్.ప్రభాకర్ రెడ్డి మంగళవారం 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఉద్యోగులకు మార్గనిర్దేశం చేశారు.

పంటచేలకు ఉప్పునీటి సమస్య



సమావేశంలో మాట్లాడుతున్న గుబ్బల శ్రీనివాస్

అమలాపురం రూరల్: జిల్లాలోని పంట చేలల్లో గోదావరి, ఆక్వా చెరువుల ఉప్పునీటి ముంపు కారణంగా వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేయడం లేదని గోదావరి సెంట్రల్ పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురం మండలం రంగాపురంలోని గోదావరి సెంట్రల్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాజోలు, అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు పినిశెట్టి వెంకట స్వామి, దాట్ల గోపీరాజు, రాజులపూడి వెంకటేశ్వరరావు, దంగేటి వెంకట రెడ్డి నాయుడు, ఆకాశం శ్రీనివాస్ మాట్లాడారు. కోనసీమలో రొయ్యల చెరువులలో ఉప్పునీరు వచ్చి పంటచేలు ధ్వంసం అవుతున్నాయన్నారు. రబీలో నీటిఎద్దడి నివారణకు క్రాస్ బండ్ల ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు మాట్లాడుతు లొల్ల లాకు శిథిలావస్థకు చేరడంతో సెంట్రల్ డెల్టాకు ఇబ్బందులు వస్తాయన్నారు. ప్రాజెక్ట్ కమిటీ గుబ్బల చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామని అన్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

అంతర్వేది.. అరకొర వసతి

- స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం
- భారీగా తరలివస్తున్న భక్తులు
- అంతంతమాత్రంగా సౌకర్యాలు

సాక్షి, అమలాపురం: ఆది దేవుడు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు మొదలయ్యాయి. తొలి రోజు మంగళవారం రథసప్తమి నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఏటా జరిగే కల్యాణోత్సవానికి వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అలాగే ఇటీవల ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ సారి వీరి సంఖ్య భారీగా ఉంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు.

13 వరకూ ఉత్సవాలు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు రథసప్తమి నుంచి ప్రారంభమై ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి. మొత్తం పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు సుమారు ఆరు లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా. కల్యాణం జరిగే ఈ నెల 7వ తేదీ ఉదయం నుంచి రథోత్సవం జరిగే 8వ తేదీ రాత్రి వరకు 36 గంటలలో కనీసం నాలుగు లక్షల మంది సందర్శిస్తారని అధికారులు చెబుతున్నారు. ఇంతమంది భక్తుల తాకిడి ఉన్నచోట తాగేందుకు నీరు, తినేందుకు ఆహారం, స్నానాలు చేసేందుకు, మరుగుదొడ్ల సౌకర్యాల కల్పనలో జిల్లా యంత్రాంగం అరకొర ఏర్పాట్లు మాత్రమే చేస్తోంది.

తాగునీరు అందించగలరా?

ఈ సారి కల్యాణోత్సవాల్లో భక్తులకు తాగునీరు అందించడం అధికారులకు తలనొప్పిగా మారనుంది. స్థానికంగా ఉన్న మంచినీటి చెరువును తాగునీటి ప్రాజెక్టుగా మార్చే పనులు జరుగుతున్నాయి. భక్తులతో పాటు స్థానికుల అవసరాలకు సరిపడా నీటిని సైతం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి ఉంది. అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల్లోని గృహ అవసరాల కోసం 20 వేల లీటర్ల సామర్థ్యమున్న నాలుగు ట్యాంకర్లతో రోజుకు 24 ట్రిప్పులు నీరు అందించనున్నారు. ఐదువేల లీటర్ల నీటి సామర్థ్యం గల 24 ట్యాంకర్లతో ఆలయం వద్ద అవసరాలకు నీటిని సరఫరా చేయనున్నారు. 5.50 లక్షల వాటర్ ప్యాకెట్లు, 1,500 వరకూ 20 లీటర్ల వాటర్ టిన్నులు అందుబాటులో ఉంచుతామని, 20 వాటర్ స్టాళ్లు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే అధికారులు చెబుతున్న స్థాయిలో నీరందించినా నీటి ఎద్దడి తప్పేలా లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయం

చలిలోనే భక్తులు

కల్యాణోత్సవానికి వచ్చే చాలామంది భక్తులు చలిలోనే కూర్చుని, చలిలోనే పడుకుంటున్నారు. స్వామివారి కల్యాణోత్సవం జరిగే చోట గతంలో పెద్ద షెడ్లు వేశారు. వీటి చుట్టూ కూడా ప్రత్యేకంగా టెంట్లు వేస్తున్నారు. మిగిలిన ప్రాంతాన్ని వదిలేస్తున్నారు. ఇటువంటి చోటనే సామాన్య భక్తులు ఎక్కువగా ఉంటున్నారు. కల్యాణం జరిగిన మరుసటి రోజు తెల్లవారుజామున సముద్ర స్నానాలు చేసేందుకు వెళ్లేందుకు రాత్రంతా కల్యాణోత్సవం జరిగే ప్రాంతంలోనే పడుకుంటున్నారు. స్వామి ఆలయం వద్ద షెడ్ల నిర్మాణం చేస్తే సామాన్య భక్తులు సేద తీరేందుకు మేలు జరుగుతోంది. కానీ ఆ దిశగా పనులు చేపట్టిన దాఖలాలు లేవు.

సత్రం భోజనమే

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకం నడుస్తోంది. ఇక్కడ వడ్డించే ఆహారం రుచికి ఫిదా కాని వారంటూ ఉండరు. స్వామివారి కల్యాణం, రథోత్సవం సమయాలలో భక్తులకు అన్నదానం చేయడం లేదు. పెద్ద స్థాయిలో భక్తులకు అన్నసంతర్పణ చేయలేమని చెబుతున్నారు. కానీ వందల కోట్ల రూపాయల ఆస్తులున్న స్వామివారి తరఫున భక్తులకు కనీసం పులిహోర, దద్దోజనం ప్యాకెట్లు ఇచ్చినా బాగుంటుందని భక్తులు చెబుతున్నారు. ఆ విషయాన్ని దేవస్థానం అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనితో భక్తుల ఆకలిని స్థానికంగా 60 వరకు ఉన్న వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తీర్చుతున్నాయి.

మరుగుదొడ్లు సరిపోతాయా?

భక్తులకు అవసరమైన మరుగుదొడ్లను అందుబాటులో ఉంచడంలో కూడా జిల్లా యంత్రాంగం విఫలమైంది. గతం కన్నా ఎక్కువ ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ ఆలయం, టీటీడీ అతిథి గృహాల వద్ద ఉన్న వాటిని భక్తులు వినియోగించే పరిస్థితి లేదు. ఇదే సమయంలో కేవలం 124 బయో టాయిలెట్లను మాత్రమే అందుబాటులో ఉంచారు. వీటివల్ల భక్తులకు పదో వంతు అవసరాలు కూడా తీరే పరిస్థితి లేదు. దీనితో చాలా మంది ఆలయం పరిసరాలు, సముద్ర స్నానాలు చేసే చోట కాలకృత్యాలు తీర్చుకోవాల్సి రావడంతో ఆ ప్రాంతం దుర్గంధ భరితంగా మారుతోంది.

పలు విమర్శలు

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఆలయానికి వస్తున్న భక్తులు ఎక్కువ కావడంతో ఆదాయం కూడా పెరిగింది. కానీ ఆ స్థాయిలో ఆలయం వద్ద కనీస సౌకర్యాలు కల్పన జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కాగా.. అమలాపురం ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ అంతర్వేది ఎల్ఎఫ్ చానల్ ద్వారా సాగునీటిని తరలించి, వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తామన్నారు. తాగునీరు మాత్రం ట్యాంకర్ల ద్వారా అందించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు.



కల్యాణ వేదిక చుట్టూ ఆరు బయట వేచిఉన్న భక్తులు (ఫైల్)



అంతర్వేదిలో పూర్తికాని మంచినీటి ప్రాజెక్టు

ముద్రగడ ఇంటిపై దాడికి ఖండన



ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఇంటిపై కొంత మంది దుండగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇటువంటి హేయమైన చర్యలు ప్రజాస్వామ్యంలో తగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందన్నారు. అధికారం శాశ్వతం కాదని, ఇటువంటి దుర్మార్గపు చర్యలను కూటమి నేతలు సమర్థించుకోవడం మానుకోవాలని హితవు పలికారు, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రసూల్

అంబాజీపేట: కొబ్బరి తోటలలో అంతర పంటగా కోకోను మరింతగా అభివృద్ధి చేయాలని బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ శాస్త్రవేత్తలు డాక్టర్ నవి రసూల్, నరేంద్రన్ పేర్కొన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో కోకో సాగు పద్ధతులపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కేంద్ర అధిపతి డాక్టర్ ఎస్‌బీవీ చలపతిరావు అధ్యక్షతన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కోకో గింజలతో తయారు చేసే ఆధారిత ఉప ఉత్పత్తులతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. కోకో సమగ్ర కీటక యాజమాన్యంపై రైతులు దృష్టి సారిస్తే అధిక దిగుబడులు ఉంటాయన్నారు. సాగు పద్ధతులు, పులియ బెట్టడం, ఆరబెట్టడం, ప్రోసెసింగ్, మార్కెటింగ్, గరిష్ఠ మద్దతు ధరపై రైతులతో చర్చించారు. ఇతర ప్రాంతాల్లో కోకోను అంతర పంటగా సాగు చేస్తున్న మాదిరిగా కోనసీమలోను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎం.శైలజ, ఆయా గ్రామాల ఉద్యాన సహాయకులు, నాబార్డ్ విశ్రాంత డీజీఎం కేఎస్ఎస్ సోమయాజులు, అంబాజీపేట, అమలాపురం మండలాల కోకో రైతులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు రీచ్‌లను గుర్తించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలోని వశిష్ట గౌతమి నదిలో ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లను గుర్తించి, అనుమతులు మంజూరు కోసం సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టా భూములలో ఇసుక మేటల తవ్వకాలకు సంబంధించిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ సర్వే నివేదిక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కపిలేశ్వరపురం మండలంలో పట్టా భూములలో ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు కోరుతూ ఏడు దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో ఒక దరఖాస్తు సంబంధించిన విస్తీర్ణం కోస్తా తీర ప్రాంత జోన్ పరిధిలో ఉందన్నారు. మిగిలిన ఆరు దరఖాస్తులకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పి.గన్నవరం మండలంలో ఆరు దరఖాస్తులు రాగా, వాటిలో ఐదింటికి సంబంధించిన విస్తీర్ణం సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని వాటికి అనుమతులు ఇవ్వడం కుదరదన్నారు. కె.గంగవరం మండలంలో వచ్చిన ఒక దరఖాస్తు అనుమతి ఇస్తామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఆ చెరువులను ధ్వంసం చేయాలి

జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించినట్లు ధ్రువీకరించిన ఆక్వా రంగ చెరువులను మార్చి నాటికి పూర్తిగా ధ్వంసం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మత్స్యశాఖ, ఏపీఈపీడీసీఎల్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడికుదురు మండలంలో 193 చెరువులను గుర్తించగా, వాటిలో 47, మలికిపురం మండలంలో 35 చెరువులకు 19 చెరువులను ధ్వంసం చేసినట్లు తెలిపారు.సఖినేటిపల్లి మండలంలో గుర్తించిన 206 చెరువులను అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ముగిసిన అనంతరం ధ్వంసం చేయడం జరుగుతుందన్నారు.

మహాకుంభమేళాకు మూడు బస్సులు

రావులపాలెం: ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రావులపాలెం డిపో నుంచి మూడు సూపర్ లగ్జరీ బస్సులు మంగళవారం బయలుదేరి వెళ్లినట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. ఈ బస్సులు భువనేశ్వర్, పూరి, కోణార్క్ దర్శనం అనంతరం మహా కుంభమేళా త్రివేణి సంగమం, వారణాసి, గయ, బుద్ధగయ, శ్రీకూర్మం, అరసవెల్లి తదితర క్షేత్రాలను దర్శించుకుని 12వ తేదీన రావులపాలెం చేరుతాయన్నారు. ఈ బస్సులకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు పచ్చ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. మూడు బస్సుల్లో మొత్తంగా 108 మంది ప్రయాణికులు తరలివెళ్లారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, కార్మికులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు



మహాకుంభమేళాకు వెళుతున్న బస్సుల వద్ద ఆర్టీసీ అధికారులు

ముద్రగడ ఇంటిపై దాడి అమానుషం



ఉప్పలగుప్తంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉప్పలగుప్తం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి అమానుషమని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. జనసేన పార్టీకు చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌తో ముద్రగడ ఇంటి గేటు, కారును ధ్వంసం చేసిన ఘటనను ఖండించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు అధ్యక్షతన ఉప్పలగుప్తంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చీకట్ల కిశోర్ నివాసంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా, ఎంపీగా, ఉద్యమ నాయకుడిగా రాష్ట్రంలో జనాదరణ పొందిన పద్మనాభాన్ని చంద్రబాబు ప్రభుత్వం గతంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేస్తే తిరుగుబాటు కచ్చితంగా ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, సర్పంచులు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజ్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరజాకుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రబీకి సాగునీటి కష్టాలు


- వంతుల వారీ విధానం అమలు
- ప్రతి లాకు నుంచి చానళ్ల ద్వారా నీటి సరఫరా
- రైతులకు తప్పని అవస్థలు

కొత్తపేట: రబీ (దాళ్వా) వరి పంటకు సాగునీటి కష్టాలు ప్రారంభం కానున్నాయి. వరి ఆయకట్లు, కాలువ తూములు, చేలగట్లపై రైతులు పడిగాపులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దాళ్వా పంటకు వంతుల వారీ విధానంలో సాగునీటి సరఫరాకు ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం నుంచి వంతుల వారీ విధానం అమల్లోకి వచ్చింది.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో సుమారు 1,72,000 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేస్తున్నారు. ఆ మేరకు గత నెల 15 నుంచి నాట్లు ప్రారంభించారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తయ్యాయి. 120 రోజుల నుంచి 130 రోజుల వ్యవధిలో పంట కోతకు వచ్చే రకాలను నాటారు. అంటే సుమారు నాలుగు నెలలకు పంట కోతకు వస్తుంది.

నాట్లు వేసి నెల రోజులు కూడా పూర్తవ్వకుండానే వంతుల వారీ విధానం అమల్లోకి వస్తే... మరో మూడు నెలల పాటు రైతులకు నీటి కష్టాలు తప్పేలా లేవు. చానల్‌కు సాగునీరు విడుదల చేశాక రైతులు ఉరుకులు పరుగుల మీద తమ భూములకు నీటిని మళ్లించుకోవాలి. చానల్ శివారు భూములకు నీరు చేరేసరికి 24 గంటల గడువు పూర్తవ్వడంతో లాకు దించేసి, కిందికి నీరు వదిలేస్తారు. ఆ భూములకు నీరు అందక మళ్లీ వంతు వరకూ ఎదురు చూడాలి.



కొత్తపేట మండలం పలివెల లాకు

నీటి సరఫరా షెడ్యూల్

జిల్లాలో ప్రధాన మూడు పంట కాలువల మొగలోని లొల్ల లాకులపై నుంచి సాగు భూమికి నీటిని సరఫరా చేస్తున్నారు.

పి.గన్నవరం, బ్యాంక్, ముక్కామల కెనాల్స్‌పై లాకుల ద్వారా నీటి సరఫరా షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి.

1.పి.గన్నవరం కెనాల్‌పై..

- లొల్ల లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 3, 4, 14, 15, 25, 26, మార్చి 8, 9, 19, 20, 30, 31, ఏప్రిల్ 10, 11
- పి.గన్నవరం లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 4, 5, 15, 16, 26, 27, మార్చి 9, 10, 20, 21, 31, ఏప్రిల్ 01, 11, 12
- మొండెపులంక లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 5, 7, 16, 18, 27, మార్చి 01, 10, 12, 21, 23, ఏప్రిల్ 01, 03, 12, 14
- పొదలాడ లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 7, 9, 18, 20, మార్చి 01, 03, 12, 14, 23, 25, ఏప్రిల్ 03, 05, 14, 16
- శివకోడు లాకుల చానళ్లకు ఫిబ్రవరి 09, 11, 20, 22, మార్చి 03, 05, 14, 16, 25, 27, ఏప్రిల్ 05, 07, 16, 18
- సఖినేటిపల్లి లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 11, 14, 22, 25, మార్చి 05, 08, 16, 19, 27, 30, ఏప్రిల్ 07, 10, 18, 21

2.అమలాపురం (ముక్కామల) కెనాల్‌పై..

- లొల్ల నుంచి పలివెల లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 4, 5, 15, 16, 26, 27, మార్చి 9, 10, 20, 21, 31, ఏప్రిల్ 01, 11, 12
- ముక్కామల లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 5, 7, 16, 17, 27, 28, మార్చి 10, 11, 21, 22, ఏప్రిల్ 01, 02, 12, 13
- నడిపూడి లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 6, 8, 17, 19, 28, మార్చి 02, 11, 13, 22, 24, ఏప్రిల్ 02, 04, 13, 15
- చింతలపూడి లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 08, 12, 19, 23, మార్చి 02, 06, 13, 17, 24, 28, ఏప్రిల్ 04, 08, 15, 19
- చల్లపల్లి లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 12, 14, 23, 25, మార్చి 06, 08, 17, 19, 28, 30, ఏప్రిల్ 08, 10, 19, 21

3.అమలాపురం బ్యాంక్ (ముక్తేశ్వరం) కెనాల్‌పై..

- ర్యాలి నుంచి వాడపాలెం లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 4, 5, 15, 16, 26, 27, మార్చి 9, 10, 20, 21, 31, ఏప్రిల్ 01, 11, 12
- చింతనలంక లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 5, 7, 16, 18, 27, మార్చి 01, 10, 12, 21, 23, ఏప్రిల్ 01, 03, 12, 14
- అన్నంపల్లి లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 7, 10, 18, 21, మార్చి 01, 04, 12, 15, 23, 26, ఏప్రిల్ 03, 06, 14, 17
- కుండలేశ్వరం లాకులపైన చానళ్లకు ఫిబ్రవరి 10, 12, 21, 23, మార్చి 04, 06, 15, 17, 26, 28, ఏప్రిల్ 06, 08, 17, 19
- టైలేండ్ (పల్లంకుర్రు) లాకులపై చానళ్లకు ఫిబ్రవరి 12, 14, 23, 25, మార్చి 06, 08, 17, 19, 28, 30, ఏప్రిల్ 08, 10, 19, 21

అవసరం మేరకు చర్యలు

ఏ ఒక్క ఎకరానికీ ఇబ్బంది తలెత్తకుండా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో వంతుల వారీ విధానం అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదావరి నుంచి వచ్చిన ప్రధాన పంట కాలువ లొల్ల వద్ద బ్యాంక్ కెనాల్ (ముక్తేశ్వరం కెనాల్), అమలాపురం కెనాల్ (ముక్కామల కెనాల్), పి.గన్నవరం కెనాల్‌గా విడిపోయింది. మళ్లీ ముక్తేశ్వరం కెనాల్ అన్నంపల్లి వద్ద నుంచి ఒకటి ఐ.పోలవరం, మరొకటి పల్లంకుర్రుకు వెళ్లింది. అమలాపురం కెనాల్ నడిపూడి వద్ద వీడి ఒకటి చల్లపల్లి, మరొకటి అల్లవరానికి వెళ్లింది. పి.గన్నవరం కెనాల్ నాగుల్లంక నుంచి పాశర్లపూడి, చాకలిపాలెం నుంచి ఒకటి ములికిపల్లి బ్రాంచ్ కెనాల్, మరొకటి రాజోలు, సొంపల్లి నుంచి చింతలపల్లి, టేకిశెట్టిపాలెం నుంచి అంతర్వేది కెనాల్, సఖినేటిపల్లి నుంచి మూడు చానళ్ల ద్వారా సాగునీరు మళ్లుతుంది. మూడు ప్రధాన కాలువలపై మొత్తం 16 లాకులు ఉన్నాయి. అన్ని లాకులపై చానళ్ల ద్వారా వరి ఆయకట్టుకు 24 గంటలు చొప్పున అవసరం మేరకు నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

సాగునీటి సరఫరా యాజమాన్యంలో భాగంగా వంతుల వారీ విధానం అమలు చేస్తున్నాం. లాకులపైన వరి ఆయకట్టుకు అనుగుణంగా వంతుకు 24 గంటల నుంచి 48 గంటలు నీరు సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం సాగునీటి ఎద్దడి లేదు. అయితే మున్ముందు గోదావరిలో వాటర్ ఫ్లో తగ్గినా రైతులు, సాగునీటి సంఘాలు, అధికారుల సమన్వయంతో రబీ పంటకు ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటాం.

– ఆర్.నాగేంద్ర కుమార్, ఇరిగేషన్ డీఈఈ, పి.గన్నవరం

క్లుప్తంగా

ముద్రగడకు పలువురు నాయకుల సంఘీభావం



ముద్రగడ పద్మనాభం, గిరిబాబుతో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి గిరిబాబుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంఘీభావం తెలిపారు. మంగళవారం కిర్లంపూడిలోని ఆయన నివాసానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పిఠాపురం మున్సిపల్ చైర్మన్ సభ్యుడు గండేపల్లి రామారావు (బాబీ), మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కౌన్సిలర్లు, ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి వెళ్లారు. ఈ సందర్భంగా విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడి ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు.

సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాలలో సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఫెస్టివల్ చైర్మన్, అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. అంతర్వేది టూరిజం గెస్ట్ హౌస్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రధాన రోజులలో సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ, తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల మెరుగైన సౌకర్యాలు కల్పనకు తీర్థం జరిగే ఏరియాను ఆరు సెక్టార్లుగా విభజించి, అన్ని శాఖల అధికారులను భాగస్వామం చేస్తున్నామన్నారు. 7వ తేదీ ఉదయం ఆలయం వద్ద రూ.200 చొప్పున 1500 కల్యాణం టిక్కెట్లు పంపిణీ చేసే విధంగా చూస్తున్నామన్నారు. ఐదు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, వాటిలో 26 మంది మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారన్నారు. సమావేశంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

అంగరంగ వైభవం



అంతర్వేదిలో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తున్న అర్చకులు

- అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవాలు ప్రారంభం
- భారీగా తరలివచ్చిన భక్తులు

అంతర్వేదిలో నేడు

అంతర్వేది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం సాయంత్రం గరుడు పుష్పక వాహనంపై, రాత్రి పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ స్వామివారి తిరువారాధన, ఆర్జిత అభిషేకం, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ సుదర్శన హోమం జరుగుతాయి.



అంతర్వేది రథాన్ని మెరక వీధికి తరలిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో లక్ష్మీనృసింహస్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సూర్యభగవానుడి జన్మదినమైన రథసప్తమిని పురస్కరించుకుని స్వామివారిని వరుడిగా, అమ్మవారిని వధువుగా అలంకరించారు. ఏటా మాదిరి గానే ముద్రికాలంకరణ (శ్రీవారిని పెండ్లికుమారుని, అమ్మవారిని పెళ్లికుమార్తె చేసే కార్యక్రమం)ను కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాలు ఘనంగా నిర్వహించాయి. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు శ్రీవారికి, అమ్మవారికి వైఖానస ఆగమానుసారం, శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రకారం విశేష పూజలు చేశారు. మామిడాకుల భస్మంతో బుగ్గన చుక్కపెట్టి, ఉంగరం తొడిగి పెండ్లికుమారుడు, పెళ్లికుమార్తెను చేసే తంతును పూర్తి చేశారు. కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయం నుంచి రథాన్ని గోవింద నామస్మరణల మధ్య మెరక వీధికి తోడ్కొని వెళ్లారు. ఉత్సవాల తొలి రోజు సాయంత్రం సూర్యవాహనంపై, రాత్రి చంద్ర ప్రభ వాహనంపైన కొలువు దీరిన స్వామి మాఢ వీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వాడపల్లిలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దేవదాయధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు జరిపారు. వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని మాఢ వీధుల్లో శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు.

గోవిందమాల దీక్షాధారణ

వాడపల్లి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో భక్తులు గోవిందమాల దీక్షా ధారణ (శ్రీనివాస శరణాగత దీక్ష) చేపట్టారు. ఈ నెల 26 వరకూ 21 రోజులు పాటు అర్ధ మండల దీక్ష చేస్తారు. వారికి డీసీ అండ్ ఈఓ చక్రధరరావు దీక్షా వస్త్రాలు, మాలలు ఉచితంగా సమకూర్చారు. అలాగే ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారు.

జి.మామిడాడలో కన్నులపండువగా రథోత్సవం

పెదపూడి: రథసప్తమి పర్వదినం సందర్భంగా జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి రథోత్సవం ఘనంగా జరిగింది. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ ఉత్సవ మూర్తులతో కలిసి సూర్య భగవానుడు పల్లకీలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి, ఆలయ బయట ఉంచిన రథంలో ఆశీనులు చేశారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చారణతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసు బాలకృష్ణారెడ్డి, ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జి.మామిడాడలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రిజర్వు ఫారెస్టులో అగ్ని ప్రమాదం



దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో వ్యాపించిన మంటలు



ఆకాశంలో కమ్మేసిన పొగ

రాజానగరం: దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. జాతీయ రహదారిని ఆనుకుని గైట్ ఇంజినీరింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న బ్రిడ్జి కౌంటీకి వెనుక భాగంలో జరిగిన ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలోని ఆకాశంలో దట్టమైన పొగలు కమ్మేశాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ పి.ప్రశాంతి అటవీశాఖ, అగ్నిమాపక దళాలను అప్రమత్తం చేశారు. రాజమహేంద్రవరం, కోరుకొండ కేంద్రాల నుంచి సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అధికారులు శ్రీనివాస్, మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో మంటలు విస్తరించకుండా నిరోధించగలిగారు. అగ్నిమాపక వాహనాలు లోపలకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో బ్లోయర్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఐదు హెక్టార్లకు మంటలు విస్తరించాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండే ఈ ప్రాంతంలో ఆకతాయిలు కాల్చిపారేసిన సిగరెట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. రాలిపోయి, దట్టంగా పడిన ఎండుటాకులు, పుల్లల వల్ల మంటలు వ్యాపించాయని, చెట్లకు, మనుషులకు నష్టం వాటిల్లలేదని అటవీశాఖ శాఖ సిబ్బంది తెలిపారు.

విద్యార్థినిని వంచించిన లెక్చరర్ అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ దేవకుమార్, చిత్రంలో సీఐ విశ్వం

కొవ్వూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి విద్యార్థినిపై అత్యాచారం చేసిన జూనియర్ అధ్యాపకుడు వేదాల వినయ్ వర్ధన్ మంగళవారం పోలీసులకు లొంగిపోయాడు. ఆ వివరాలను డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరం ఓ ప్రైవేటు కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వినయ్ వర్ధన్ అదే కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొవ్వూరుకు చెందిన విద్యార్థినితో ప్రేమ వ్యవహారం నడిపాడు. వినయ్ వర్ధన్‌కు గతంలోనే వివాహమైంది. 2014లో భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తనకు పెళ్లి కాలేదని చెప్పి విద్యార్థినిని నమ్మించాడు. ఆమెను ఈ నెల 28వ తేదీ రాత్రి మోటారు సైకిల్ ఎక్కించుకుని విజయవాడలో లాడ్జికి తీసుకు వెళ్లాడు. అక్కడి నుంచి అనంతపురంతో పాటు పలు ప్రాంతాల్లో తిప్పాడు. బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 29న పట్టణ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా.. ఈ నెల 2వ తేదీన బాలిక కొవ్వూరుకు తిరిగి వచ్చింది. తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది. వారి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు..అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను పరీక్షల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మహిళా ఎస్సై ద్వారా వివరాలను నమోదు చేసి, బాలిక ఫోన్, సీసీ పుటేజీల సహకారంతో నిందితుడిని గుర్తించారు. అతడిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకు తరలించారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఇద్దరు అంతర జిల్లా దొంగల అరెస్టు

- రూ.40 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కృష్ణారావు



రాజోలు చోరీ కేసులో రికవరీ చేసిన సొత్తును చూపిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: ఇద్దరు అంతర జిల్లా నేరస్తులను పోలీసులు పట్టుకున్నారు. రాజోలులో జరిగిన ఓ చోరీ కేసుకు సంబంధించిన దర్యాప్తులో ఇద్దరిని అరెస్టు చేశారు. వారిని విచారణ చేయగా దాదాపు 25 నేరాలతో సంబంధం ఉందని తెలిసింది. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాజోలుకు చెందిన విశ్రాంత తెలుగు పండిట్ బాపన్న గుప్తా, కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 20న అన్నవరంలో జరుగుతున్న ఓ శాంతి సమావేశాలకు వెళ్లారు. అనంతరం గత నెల 24న ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే రూ.40 లక్షల బంగారు నగలు, వెండి వస్తువులు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, క్రైమ్ పార్టీ రంగంలోకి దిగాయి. నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించి, పాత నేరస్తుల క్రైమ్ సస్పెక్ట్ షీట్ల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పాత నేరస్తులైన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన గుబ్బల భాస్కర్, కొత్తపల్లి నరేష్ ఈ చోరీ చేసినట్టు గుర్తించారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరాన్ని అంగీకరించారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, పాలకొల్లు, పెనుమంట్ర, పాలకోడేరు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, రాజోలు గ్రామాల్లో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారు. రాజోలులో దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను నర్సాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం శివారు నక్కావారిపేటలోని కాసువారి నాస్ గార్డెన్స్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై బి.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

అశ్లీల వీడియోల పేరుతో యువతికి బెదిరింపులు

- విడతల వారీగా రూ.2,53,76,000 కాజేసిన కేటుగాటు
- నాలుగేళ్ల నుంచి కొనసాగుతున్న వేధింపులు
- నిందితుడిని పట్టుకున్న పోలీసులు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ము, ఆభరణాలు చూపుతున్న పోలీసులు

కొవ్వూరు: అశ్లీల వీడియోల పేరుతో యువతిని బెదిరిస్తూ నాలుగేళ్ల నుంచి డబ్బులు గుంజుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను మంగళవారం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో డీఎస్పీ జి.దేవకుమార్ వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. నిడదవోలుకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న గాయత్రీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ విప్రో కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అదే హాస్టల్‌లో ఉంటున్న కాజా అనూషాదేవితో ఆమెకు పరిచయం ఏర్పడింది. గుంటూరు జిల్లా ఓబులనాయుడుపాలేనికి చెందిన నీనావత్ దేవా నాయక్ అలియాస్ మధు అనే వ్యక్తిని అనూషాదేవి వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో స్నేహితురాలికి తన భర్తను పరిచయం చేసింది. అనూషాదేవితో ఉన్న పరిచయం, ఒకే హాస్టల్లో ఉండడంతో బాధితురాలు ఆమెతో అత్యంత సన్నిహితంగా ఉండేది. దీంతో దేవ నాయక్ వేరే వ్యక్తి ఫోన్ చేసినట్లుగా బాధితురాలికి ఫోన్ చేసి తన వద్ద ఆమె న్యూడ్ వీడియోలున్నాయని, వాటిని ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరించారు. అలా చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. విడతల వారీగా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు వేయించుకునేవాడు. ఇలా కూడబెట్టిన సొమ్ముతో చిన్న కాకానిలో అపార్ట్‌మెంటు కొనుగోలు చేశాడు. కారు, బుల్లెట్, పెద్ద ఎత్తున బంగారం, వెండి ఆభరణాలు కొనుగోలు చేశాడు. కాగా..తనను ఒక వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేస్తున్న విషయాన్ని అనూషాదేవికి బాధితురాలు తెలిపింది. ఈ విషయం మళ్లీ దేవానాయక్ దృష్టికి వెళ్లింది. వేరొకరి ద్వారా సెటిల్‌మెంట్ చేసినట్లు బాధితురాలిని నమ్మించాడు. అలాగే పలు అవసరాల కోసం బాధితురాలి దగ్గర డబ్బులు కాజేశాడు. కాగా.. అనూషాదేవి, ఆమె భర్త దేవానాయక్‌లు తనను మోసం చేస్తున్నారని బాధితురాలు గుర్తించించి. దీంతో తల్లిదండ్రులతో కలిసి నిడదవోలు పోలీసులను ఆశ్రయించింది. ఇలా ఆమె 2021 నుంచి 2025 వరకూ దాదాపు రూ.2,53,76,000 మోసపోయింది. మరో రూ.14 లక్షలు డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించింది.

మూడు రోజుల్లో కేసు ఛేదన

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మూడు రోజుల్లో దేవా నాయక్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి రూ.1,81,45,000 విలువైన 938 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.250 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.75 లక్షల నగదు, కారు, బుల్లెట్ స్వాధీనం చేసుకున్నారు. చిన్నకాకానిలో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటును స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా స్వాధీనం పర్చుకున్నారు.

అప్పుల బాధతో కుటుంబం అదృశ్యం



శ్రీనివాస్(ఫైల్)

సఖినేటిపల్లి: అప్పుల బాధలు తాళలేక భార్యా పిల్లలతో కలిసి చనిపోతున్నానంటూ ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అంతర్వేదిపాలేనికి చెందిన అంతర్వేదిపాలెం శ్రీనివాస్ ఐస్‌ఫ్యాక్టరీ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. అవసరాల కోసం కొందరి వద్ద అప్పులు చేశాడు. వారందరూ వాటిని తీర్చాలని బడ్డీ దగ్గరకు వచ్చి, ఇష్టం వచ్చినట్టు తిడుతుండడంతో మనస్తాపం చెందాడు. దీంతో సూసైడ్ నోట్ రాసి భార్య గంగాభవాని, కుమార్తె దైవజ్ఞ, కుమారుడు మాధవ్ గణేష్‌తో కలిసి సోమవారం అదృశ్యమయ్యాడు. అతడి చిన్నాన్న అంతర్వేదిపాలెం పుల్లయ్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనధికార ర్యాంపుల పరిశీలన

పి.గన్నవరం: మండలంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన డీఎస్‌పాలెం, పెదకందాలపాలెం ఇసుక, మట్టి ర్యాంపులను జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. డీఎస్‌పాలెంలో నదీ పాయపై తూరలు ఏర్పాటు చేసి, నిర్మించిన బాటను ఆమె పరిశీలించారు. తూరలు వేయడం వల్ల కలిగే ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం పెదకందాలపాలెం ర్యాంపు వద్దకు వెళ్లారు. వీటిపై పరిశీలన చేసి, తనకు నివేదిక అందించాలని మైన్స్, హెడ్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. అంతకు ముందు పి.గన్నవరం కొత్త అక్విడెక్టును సందర్శించారు.

కేసు నమోదు

పెదకందాలపాలెం ర్యాంపులో మట్టి అక్రమ తవ్వకాల కోసం బాటలు నిర్మిస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని, దానిని బయటకు తరలిస్తున్న అధికారులను అడ్డుకోవడమే కాకుండా, వారి విధులకు ఆటంకం కలిగించిన పృథ్వీ అనే వ్యక్తితో పాటు అతడి అనుచరులపై పి.గన్నవరం పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యాహ్నం తహసీల్దార్ ఆదేశాలతో పోలీస్, రెవెన్యూ అధికారులు ర్యాంపులోని జేసీబీని బయటకు తీసుకువస్తుండగా పృథ్వీ, అతడి అనుచరులు తమను అడ్డుకున్నారని వీఆర్వో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

బాబోయ్ దొంగలు

- అచ్చన్నపాలెంలో 48 కాసుల బంగారం, రూ.2 లక్షల చోరీ
- పేరూరు జంక్షన్‌లో రూ.1.50 లక్షల అపహరణ

నల్లజర్ల: అచ్చన్నపాలెంలోని ఓ రైతు ఇంట్లో 48 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలను దొంగలు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన వట్టికూటి సీతారామకృష్ణ, ఆయన భార్య సోమవారం రాత్రి తమ ఇంట్లోని మధ్య గదిలో నిద్రకు ఉపక్రమించారు. ఆ గది వెనుక ఉన్న మరో గదిలో బీరువా ఉంది. అర్ధరాత్రి తర్వాత దొంగలు.. పెరట్లో జామకాయలు కోసేందుకు ఉపయోగించే ఇనుప ఊచకు మరో కర్ర తగిలించి కిటికీలోంచి దాదాపు 10 అడుగుల దూరంలో ఉన్న తలుపు గడియను తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడున్న బీరువాకే తాళాలు తగిలించి ఉంచడంతో దాన్ని తెరిచి, 48 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు దోచుకెళ్లారు. ఎటువంటి ఆధారాలు దొరక్కుండా గది అంతా కారం చల్లారు. మంగళవారం ఉదయం నిద్ర లేచేసరికి పెరటివైపు తలుపు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్టు సీతారామకృష్ణ దంపతులు గుర్తించారు. సమాచారం అందుకున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, క్రైం ఏఎస్పీ ఎల్.అర్జున్, నల్లజర్ల సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు క్రైం ఏఎస్పీ అర్జున్ తెలిపారు.

మోటారు సైకిల్ డిక్కీలో రూ.1.50 లక్షల చోరీ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం సమీపంలోని పేరూరు వై.జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి చెంతన పార్కు చేసి ఉన్న మోటారు సైకిల్ డిక్కీలోంచి రూ.1.50 లక్షలను దొంగలు చోరీ చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. అనపర్తి మండలం కుతుకులూరుకి చెందిన సత్యనారాయణరెడ్డి అమలాపురం, పరిసర గ్రామాల్లో డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తారు. ఇలాగే తన సన్నిహితుడితో కలిసి వసూలు చేసిన నగదును కవర్‌లో పెట్టి, తన మోటారు సైకిల్‌లో డిక్కీలో దాచారు. అనంతరం వై.జంక్షన్‌లోని ఒక హోటల్ ముందు మోటారు సైకిల్‌ను పార్కింగ్ చేసి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ఇంతలో ఇద్దరి యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి సత్యనారాయణరెడ్డి మోటారు సైకిల్ డిక్కీలోని నగదును తీసుకుని వెళ్లిపోయారు. హోటల్ నుంచి బయ టకు వచ్చిన సత్యనారాయణరెడ్డి తన నగదు పోయిన విషయాన్ని గుర్తించి, దొంగల కోసం చుట్టుపక్కల గాలించాడు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ పి.వీరబాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.